క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఈఈ (టీ2) ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. శ్యామలానగర్, రవీంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని శ్యామలానగర్, సాయినగర్, స్తంభాలగరువు, పాత పట్టాభిపురం ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంతరిక్ష యాత్రలో భాగస్వామ్యం గర్వకారణం

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి భాగస్వామ్యం వహించడం దేశానికి గర్వకారణమని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1984లో రాకేశ్ శర్మ అంతరిక్షంలో తొలిసారిగా అడుగు పెట్టిన సుదీర్ఘ కాలం తరువాత శుభాన్షు శుక్లా అంతరిక్షంలో ప్రవేశించి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. శుభాన్షు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లిన 634వ వ్యోమగామిగా నిలిచారని, 28 గంటల అనంతరం వీఎస్ఎస్ తొయ్యాగ్నియం-4 అనుసంధానం జరిగిందన్నారు. అంతరిక్ష జ్ఞానం అనంతమైన ఆసక్తి కరమైన జ్ఞానమని, స్టార్ లింక్, స్పేస్ ఎక్స్, బ్లూఆంజన్ వంటి సంస్థలు అంతరిక్షంలో సంచలనాలు సృష్టిస్తున్నారని వివరించారు. యువతకు అంతరిక్ష రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, కృషి, పట్టుదల, పరిశోధనపై ఆసక్తి ఉన్న వారికి ఆకాశం తాకేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ ఆప్షన్ పరిశీలించాలి

లక్ష్మీపురం: గుంటూరులో రీజనల్ ప్రావిడెంట్ కమిషనర్‌ను యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలిసి విద్యుత్ ఉద్యోగుల ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ ఆప్షన్లు పరిశీలించాలని విన్నవించారు. హయ్యర్ పెన్షన్ రికవరీ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, ఎల్.రాజు, కోశాధికారి ఎం.సి.హెచ్.వీరాంజనేయులు, గుంటూరు సర్కిల్ రీజనల్ అధ్యక్షుడు రాంప్రభాకర్, నాయకులు నాగేశ్వరరావు, రోహిణి కుమార్, సీఐటీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా నాయకులు బాబూప్రసాద్ పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో సేవలు భేష్



మంగళగిరి: అర్బన్ హెల్త్ సెంటర్లలో పేదలకు వైద్య సేవలు అందుతున్న తీరు అభినందనీయమని ఢిల్లీ ఏబీడీఎం జాయింట్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ కిరణ్ గోపాల్ కొనియాడారు. శుక్రవారం నగర పరిధిలోని గణపతినగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన కిరణ్‌గోపాల్ పేదలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. అర్బన్ హెల్త్ సెంటర్లలో పేదలకు అన్ని వైద్య సేవలు అందేలా తీర్చిదిద్దగం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏబీడీఎం స్టేట్ మోడల్ ఆఫీసర్ టీవీ రావు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుస్మిత, స్టేట్ టీమ్ మేనేజర్ యశ్వంత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష తదితరులు పాల్గొన్నారు.

పది రోజులకు ఒకసారి తాగునీరు

తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో 10 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతుందని.. పరిష్కారానికి చర్యలు తీసుకోపోతే ఆందోళన తప్పదని సీపీఎం తాడికొండ మండల కార్యదర్శి చింతల భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 40 వేల మంది జనాభా ఉన్నప్పటికీ పైపులైన్‌లు మరమ్మతుల పేరుతో గుత్తేదారు చేస్తున్న జాప్యం కారణంగా పరిస్థితి నానాటికీ దిగజారుతుందన్నారు. కృష్ణానది చెంతనే ఉన్నా ఈ దుస్థితి ఉండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీరు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

మందడం ఎస్సీ కాలనీ మహిళల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎట్టకేలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. గ్రామంలో పైపులైన్‌లు లీకేజీలు ఉన్న కారణంగా నీరు పూర్తిగా కలుషితమై ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మహిళలు రోడ్డెక్కారు. అయితే అధికారులు నామమాత్రంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చేసి తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

నేటి నుంచి 'రథ్ ఫెస్ట్ 2025'

తెనాలి: 'ఇస్కాన్' టెంపుల్, తెనాలి ఆధ్వర్యంలో 2025 సంవత్సర రథోత్సవం (రథ్ ఫెస్ట్-2025)లో భాగంగా 'జిజ్ఞాస' సంస్థ సహకారంతో వివిధ సాంస్కృతిక అంశాల్లో రెండురోజుల పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొత్తం 51 అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి.

కార్పొరేషన్ ఎదుట ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నెహ్రూనగర్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచకపోవటంతో ఆందోళన బాట పట్టాల్సి వస్తోందని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఇంజినీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను విభజించి పారిశుద్ధ్య కార్మికులకు జీతం పెంచి, ఇంజినీరింగ్ కార్మికులకు జీతం పెంచకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచలేదన్నారు. తక్కువ జీతాలు పొందుతున్న చిరు ఉద్యోగులు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలుగుదేశం పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికీ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయడం లేదని అన్నారు. 2024 ఎన్నికలకు ముందు 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన జీఓలను జారీ చేయకుండా కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను తీవ్ర దోపిడీకి గురి చేసిందని విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు వెంటనే పెంచాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర సర్వీసులైన తాగునీరు సరఫరా, వీధి దీపాలు, ఇతర ఇంజినీరింగ్ కార్మికులందరూ నిరవధిక సమ్మెకు సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. జూలై 4వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రాష్ట్రవ్యాప్త మహా ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు పాశం పూర్ణచంద్రరావు, కాటమరాజు, కుమార్, రత్నబాబు, రసూల్, నరసింహారావు పాల్గొన్నారు.

ఆలయ దుకాణాల లీజు హక్కుల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పట్నంబజారు: నగరంలోని లాలాపేట శ్రీవేంకటేశ్వర స్వామి గ్రూపు ఆలయాలకు సంబంధించి పలు దుకాణాలకు శుక్రవారం నాజ్‌సెంటర్‌లోని అంజనేయస్వామి దేవస్థానంలో వేలం నిర్వహించారు. గ్రూపు ఆలయాల అసిస్టెంట్ కమిషనర్ టి.సుభద్ర ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలం పాటలో ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించి కొబ్బరి కాయలు, ఆకుపూజకు సామగ్రి విక్రయించుకునేందుకు సి.హెచ్.కమల, నెలకు రూ.53 వేలు పాట దక్కించుకున్నారు. కొబ్బరిచిప్పల సేకరణకు మల్లాది హరీష్, నెలకు రూ.15 వేలు, పాదరక్షకులు భద్రపరుచుకునేందుకు శ్రీనివాస్, రూ.10,500లకు పాట దక్కించుకున్నారు. లాలాపేట వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి పూజా సామగ్రి దుకాణాన్ని ఆర్.మస్తానమ్మ రూ.28 వేలకు నెలకు వెచ్చించి పాట దక్కించుకున్నారు. పాదరక్షకులు భద్రపరుచుకునే లైసెన్సు కె.నర్మద, రూ. 2,800లకు దక్కించుకున్నారు. పై పాటలు మొత్తం రెండో సంవత్సరం హక్కులు పది శాతం పెంపుదలతో షరతలకు లోబడి అందజేసినట్లు అసిస్టెంట్ సుభద్ర తెలిపారు. ఈఏడాది జూలై 1 నుంచి 2027 జూన్ 30వ తేదీ వరకు వేలం పాట దక్కించుకున్నారని వివరించారు.



పాత స్థానంలో ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్



కొత్తగా ఏర్పాటు చేయనున్న స్థలం

ఇష్టారాజ్యంగా...

నెహ్రూనగర్: స్తంభాలగరువు 1వలైను మెయిన్ లైను వద్ద విద్యుత్ శాఖ అధికారులు అడ్డగోలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మీద ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు అడ్డుకున్నారు. పాత స్థానంలోనే ఏర్పాటు చేయాల్సి ఉండగా, రోడ్డు మీద అడ్డంగా ఏర్పాటు చేయడాన్ని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. అధికారులు స్పందించి అభ్యంతరం లేని ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

యువకుడిని బెదిరించి నగదు దోపిడీ

పట్నంబజారు: యువకుడిని బెదిరించి నగదు, వస్తువులు దోచుకునిపోయిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కర్నూలుకు చెందిన యువకుడు గురువారం ఉదయం పరీక్ష రాసేందుకు గుంటూరు వచ్చాడు. తనతోపాటు రైలు సర్వీసులో తన ద్విచక్ర వాహనం తెచ్చుకున్నాడు. అయితే గుంటూరులో దిగిన క్రమంలో పెట్రోలు అయిపోవడంతో ఆటోలు కొంత దూరం వెళ్లి పెట్రోలు తిసుకుని వస్తున్న సమయంలో ఆటోలో గుర్తుతెలియని వ్యక్తులు యువకుడిని బెదిరించి అతని వద్ద ఉన్న నగదు, పలు వస్తువులు దోచుకుని వెళ్లినట్లు సమాచారం. ఈఘటనపై బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులను వివరణ కోరగా కేసు నమోదు చేయలేదు. కేసు నమోదు అనంతరం దర్యాప్తు చేస్తామన్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు

మంగళగిరి టౌన్: దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సీపీఎం పట్టణ కమిటీ మద్దతు తెలియజేస్తున్నట్లు పట్టణ కార్యదర్శి వీవీ జవహర్ లాల్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని కార్యాలయంలో శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా జరిగే సమ్మెలో నగర పరిధిలోని పార్టీ సభ్యులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు చెంగయ్య, జేవీ రాఘవులు, బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



ఫిరంగిపురం: పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్ఫూర్తి ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్ అన్నారు. మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన కె.చంద్రికారాణి ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. విద్యార్థికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్ఫూర్తి ఫౌండేషన్‌ను ఆమె తల్లిదండ్రులు ఆశ్రయించారు. దీంతో సంస్థ చైర్మన్ శ్రీవ్యాల్ తన ప్రతినిధి శివప్రసాద్‌ను గ్రామానికి పంపించి పూర్తి వివరాలు సేకరించారు. ఫౌండేషన్ తరుపున విద్యార్థి కళాశాల ఫీజు చెల్లించేందుకు రూ.83 వేలు చెక్కు అందజేశారు.

మహిళలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



డీఎస్పీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రవి, కేవీపీఎస్ నాయకులు, బాధిత మహిళలు

తాడికొండ: తుళ్లూరు మండలం మందడం గ్రామంలో ఏపీ సచివాలయానికి కూతవేటు దూరంలో ఎస్సీ కాలనీకి మంచినీరు అందడం లేదంటూ నిరసన తెలిపిన మహిళలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. ఈ మేరకు శుక్రవారం మందడంలోని తుళ్లూరు డీఎస్పీ కార్యాలయంలో ఆయనను బాధిత మహిళలతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీన దళిత మహిళలు మంచినీరు ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేసిన సందర్భంగా పోలీసులు కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. కృష్ణానది చెంతనే ఉన్నా రాజధాని అమరావతిలో మందడంతో పాటు పలు గ్రామాల్లో మంచినీటి సమస్య ఉండడం బాధాకరమన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్పందించి రాజధాని గ్రామాల్లో మంచినీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాజధాని గ్రామాల తాగునీటి సమస్యల పరిష్కారానికి సీఆర్‌డీఏ రూ.10.75 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. తుళ్లూరులో నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకు వెంటనే పూర్తి చేసి నేలపాడు, శాఖమూరు గ్రామాలకు రాజధాని కోర్ క్యాపిటల్ పైపులైన్ నుంచి తాగునీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీ కృష్ణను కలిసి కేసులు ఎత్తివేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాజధాని డివిజన్ కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం నష్ట పరిహారం చెల్లించాలి



దీక్షా శిబిరంలో కార్మికులు, నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 206వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన దుర్గారావు, స్టీవెన్‌లు మాట్లాడుతూ.. కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేసి వెళ్లిన యాజమాన్యం అడ్రస్ లేకుండా పోయిందని అన్నారు. ప్రస్తుతం ఏసీసీ ఫ్యాక్టరీ భూమి ఒక్కటే పరిహారానికి ఆధారంగా ఉందన్నారు. పరిహారం చెల్లించేంత వరకూ కార్మికులు దీక్షలు కొనసాగిస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, ఇస్మాయిల్, సాంబశివరావు, సూర్యప్రకాశరావు, గురవయ్య, కార్మికులు ఇమాంబీ, రమాదేవి, సారమ్మ, శివకుమారి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడికి సన్మానం

దుగ్గిరాల: పర్యావరణ వేత్త, రాష్ట్ర ప్రభుత్వ అటవీ, పర్యావరణ సలహాదారుడు కొమెర అంకారావుకు శుక్రవారం దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ.. మొక్కలలోని రకాలు, వాటి ఉపయోగాలు, పెంచవలసిన ఆవశ్యకతని విద్యార్థులకు వివరించారు. అనంతరం మండలంలోని ఉత్తమ రైతు అవార్డు గ్రహీత ఎర్రు పాపారావు, అంకారావులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పి.గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ రవికుమార్



తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ వేమూరి రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సహకారంతో తెలుగు వారిని ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని అన్నారు. ఎన్ఆర్ఐల భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్రంలో చదువుకున్న యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ బి.శేషారావు, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఎడ్యుకేషన ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, ఏపీఎన్‌టీసీ ఎండీ గణేష్‌కుమార్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'చలో తెనాలి' కరపత్రాలు పంపిణీ

తాడేపల్లి రూరల్: శనివారం(నేడు) నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేక అమరారెడ్డినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ఎన్నిమార్లు చెప్పినా పోలీసుల తీరు మారడం లేదని అన్నారు. దళిత యువకులు తప్పుచేశారని తెలిస్తే చట్టం ముందు నిలబెట్టాలి గానీ.. నడిరోడ్డుపై లాఠీలకు పనిచెప్పకూడదని అన్నారు. ఈ దుశ్చర్యను ఖండించకపోతే భవిష్యత్తులో తెనాలి సంఘటనలు మరల జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, కె.బాబూరావు, బర్నబాస్, దుర్గారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

నెహ్రూనగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 20, 22వ డివిజన్లలో రూ.1.39 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నగర మేయర్ కోవేలమూడి రవీంద్ర, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో కుల మత పార్టీలకతీతంగా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని శివారు ప్రాంతాలలో చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని అరికట్టేందుకు నిరంతర నిఘా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నగరంతో పాటు నగరంలో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రాధాన్య క్రమంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గేదెల నాగరంగమణి, నిమ్మల వెంకట రమణ పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్ల వేతన సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓ ఖుద్దూస్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీ అయిన ఉపాధ్యాయుల వేతన సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్‌బంగ్లారోడ్డులోని ఎంఈఓ కార్యాలయంలో యూటీఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో తూర్పు ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లు అప్‌డేట్ చేసి, ఎల్‌పీసీలు ఇవ్వాలని కోరారు. మంగళగిరి కార్పొరేషన్ నుంచి బదిలీపై గుంటూరు కార్పొరేషన్‌కు వచ్చిన ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లు, ఎల్‌పీసీల కోసం మంగళగిరి ఎంఈఓకు లేఖ రాయాలని సూచించారు. అదే విధంగా ఎస్జీటీ నుంచి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన వారికి ఇంక్రిమెంట్లు మంజూరు చేసి పే ఫిక్సేషన్ చేయాలని కోరారు. దీనిపై తక్షణమే తగు చర్యలు తీసుకుని, బదిలీపై వచ్చిన వారి జీతాలు జాప్యం కాకుండా చూడాలని కోరారు. ఎంఈఓను కలిసిన వారిలో సంఘ జిల్లా కార్యదర్శి బెల్లంకొండ ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు ఎం.కోటిరెడ్డి, నగర అధ్యక్షుడు ఎం.చిన్నయ్య, నాయకులు రెహమాన్, శివరామిరెడ్డి, చంద్రశేఖర్,నరసింహారావు, షబ్బీర్, ధనలక్ష్మి ఉన్నారు.

మూత్ర సమస్యలపై అవగాహన ఉండాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ మూత్ర సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ న్యూరాలజిస్టులు కార్తీక్ ఆరె, చేకూరి సింధూశ్రీ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మూత్ర సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో సదస్సు ప్రారంభించారు. వైద్యులు మాట్లాడుతూ మూత్ర వ్యవస్థకు సంబంధించి సమస్యలు మహిళలు, పురుషుల్లో కనిపిస్తాయని అన్నారు. మూత్ర మార్గ సంక్రమణ, మూత్రంలో రక్తం రావడం, తక్కువ మూత్ర విసర్జన, మూత్రవిసర్జనలో ఇబ్బందులు వంటి లక్షణాలకు నివారణ చర్యలు ముఖ్యమని చెప్పారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. సంస్థ అధ్యక్షులు మన్నె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ అధికారికి వినతిపత్రం అందజేత



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయం అధికారికి పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారని.. ఒక బ్రాంచ్‌కు పర్మిషన్ తీసుకుని అనేక బ్రాంచ్‌లలో క్లాసులు నిర్వహిస్తున్నారని అన్నారు. పైఅంశాలను వివరిస్తూ ఇంటర్మీడియెట్ ప్రాంతీయ అధికారి(ఆర్ఐఓ)కు వినతిపత్రం అందజేశామని, సానుకూలంగా స్పందించిన అధికారి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలే తప్ప.. అమలెక్కడ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మంగళగిరి/ మంగళగిరి టౌన్: రాష్ట్రంలో కూటమి పాలన ఏడాది పూర్తయినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం 'కార్పొరేట్‌లకు వరాలు- పేదలకు శాపాలు' అనే పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి పాలనలో సామాన్యులకు సంక్షేమ పథకాలు అందడం లేదని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి నేటికీ ఆ ఊసే ఎత్తలేదన్నారు. కూటమి పాలన కేవలం కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, నాయకులు బాలకృష్ణ, చలపతిరావు, గణేష్, బ్రాహ్మణి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.